# షాలిమర్

మా లాడ్జిలో వాళ్ళందరూ, అవాళ నన్ను చూసి నా వాలకం, వేషం చూసి, షాక్ అయినారు: అనగా విస్మయాంబుధిలో మునిగి పోయినారు.

మా లాడ్జిలో నేను మినహా మిగతా సదస్యులందరూ, ఓ కాలేజీలో చదువు కునే విద్యార్థులు. అనుభవం కరుకు తెలినవాళ్ళు.

సంజెవేళ యెండ యింకా ఒకటో రెండో పొరలు ఉండగానే, ఒక్కొక్కడూ దిద్ది తీర్చుకుని షికారు బయలు దేరుతారు. అందరూ ఎప్పుడూ మల్లెపూలులాగా ఉంటారు - కట్టూ జుట్టూ మాయకుండా, రేగకుండా.

అందరిలోకీ ఏబ్రాసిని నేను ఒక్కడినే. తల ఎప్పుడూ దువ్వేసుకు పోయి నట్లు వుంటుంది. చొక్కాకు గుండీలు ఉండవు. పంచనిండా, లుంగీనిండా కాఫీ-టీల మరకలు, గరగరలాడే గడ్డం, నిదురకు ఎన్నడూ నోచుకోని కళ్ళు. నా గాలి సోకగానే ఇస్త్రీ మడతలు మాసిపోతాయి:

ఇలా మసిపాతలాగ ఉన్నా, కథలు వ్రాస్తాననే భయం కొద్దీ, నా జోలికి ఎవడూ వచ్చేవాడు కాడు; వీలైనంత వరకూ గౌరవంగానే చూడటానికి ప్రయత్నించే వాడు ప్రతివాడూను — వీడిని ఏమంటే ఏం మునుగుతుందో అని:

సరే, ఇన్ని విధాల సర్వ — రోతగానూ వుంటూన్న వాడినల్లా, వున్న వాడిని వున్నట్టు ఊరుకోక, అమాంతం ఒక మంచి ముహూర్తాన తల చక్కగా క్రాప్ చేయించి, అల్లారుముద్దుగా దువ్వి, మొగానికి మెరుగురాచి, జాజిరేకులలాటి దుస్తులు హొంకంగా ధరించి, కలకల లాడుతూ ప్రత్యక్షమైతే వాళ్ళందరిలోనూ సంచారీ-వ్యభిచారీ భావములు ఎన్ని రీతులుగా చెలరేగినవో, నేను ఊహించేందుకైనా తంటాలు పడలేదు:

కొందరు - సందేహించారు: కొందరు భయపడ్డారు: కొందరు నవ్వేందుకు సందు దొరికింది కదా అని సంబరపడ్డారు: మొత్తానికి అందరి మనసుల్లోనూ స్థాయి కలకబారింది:

వీడి వాలకం ఏమిటో ఎవడికీ అంతు చిక్కటం లేదు: ఎవడికి వాడు దొంగ దాటుగా, నా కళ్ళపంక చూస్తున్నాడు: చూపుల్లోనైనా వేపకాయంత వెర్రి బయట పడుతుందేమోనని: అమావాస్య రేపో ఎల్లుండో ననగా నన్ను తప్పుకు తప్పుకు తిరిగారు, ఎక్కడ మీదబడి కరుస్తానో అని:

నేను ఒక్కరినీ కరవలేదు: బిగ్గరగా ఏనాడూ అరవ నన్నా లేదు: వెర్రో మొర్రో నాలో నేను కూనిరాగం తీస్తూండడమే కాని:

ఇదమిత్థమని తెల్సుకోలేని స్థితిలో రోజులు గడుస్తూండటం, నేను ఎప్పుడూ యెదుట మెలగుతూండటం, నాగది అంతా అత్తరూ-పన్నీరూ-మయమై పోతూండటం, ఆనాటి కానాడు నేను మరీ బాలా-కుమారుణ్ణయి పోతూండటం; ఇలా అయితే వాళ్ళ ఆరోగ్యానికి భంగకారి అని గట్టిగా తోచి వుండవచ్చును-వుండ వచ్చు నేమిటి తోచింది:

అందుచేత అవాళ ఆదివారం కదా, అందరూ వేళకు అక్కడే వుండి నన్ను పరివేష్టించి అందరిలోనూ రవంత తెంపరితనం వున్న ఒకడిచేత అడిగించారు- "భాయీ, నీకు వచ్చిన ఆపద ఏమిటిరా ?" అని;

నేను ఆశ్చర్యం, అమాయకత్వం అభినయించాను; "ఏంలేదే" అంటూ నసిగాను;

కాదు, సంగతేమిటో చెప్పమని, కాదు - కూడదని, మెడలు విరిచారు; తాము మనసులో ఇన్నాళ్ళనుంచీ పడుతున్న గుంజాటన యావత్తూ చిలవలు-పలవ లుగా వివరించారు.

ఇహ, చెప్పక తప్పింది కాదు:

ఈ సంగతి ఫాలాక్షుడికి తెలియకూడదు. తెలిస్తే కొంపలు అంటుకుపోతాయి. ఖూనీలు జరుగుతాయి. విప్లవం విజృంభించి, దేశం అరాచకమై పోతుంది అని నా భయం. ఎవరితోను చెప్పమని ఎన్నో ఒట్లూ ప్రమాణాలు చేశారు: ఇక అంత టికీ నాకు అనుగ్రహం రాకపోతే ప్రాయోపవేశం చేస్తామన్నారు;

అప్పుడు బయట పెట్టాను: నేను ఫలానా అమ్మాయిని ప్రేమిస్తున్నానని, ఆ ప్రేమలో మునిగి తేలుతున్నానని:

ఆ అమ్మాయి భోగట్టా, మీకు కొంత చెప్పకపోతే వాళ్ళందరూ ఆ సువార్త వినేటప్పటికల్లా ఏమైనారో ఊహించేందుకు వీలుండదు:

అమ్మాయి అంటే అమ్మాయి కాదు. కుందనపు బొమ్మాయి! వాళ్ళ నాన్నకు ఒక్కతే కూతురు: వాళ్ళ నాన్న ఏభై లక్షలకు ఒక్కడే కొడుకు:

నమ్మకుంటా వుందామని, మనసులో ప్రతివాడూ ఎంతో తపించాడు. ఇది శుద్ధ అబద్ధమూ, వట్టి బుకాయింపూ అయేట్లు ప్రసాదించమని. ఎవడి కులదైవానికి వాడు మనసులో కోటి మొక్కులు మొక్కుకున్నాడు:

అందరూ అసూయతో హతమారి పోతున్నారు మనమీద. అత్తరువులు ఆనాటి కానాడు ఘుమాయించి పోతున్నవి:

ఇలా ఒక మాసం గడిచింది: ముప్పై ఒకటో నాటి నుంచీ మళ్ళా అలు గుడ్డగా తయారైనాను: అందరి కళ్ళూ ఒక్కతూరి చల్లబడ్డవి:

నెల్లాళ్ళ నిదానించి చూశాను: వీళ్ళలో ఒక్కడికన్నా, బుద్ధి ఉన్నదేమో నని, ఏంరా నిన్ను ఆ అమ్మాయి ప్రేమిస్తూన్నదా ? అని అడుగుతాడేమోనని, ఊహుం....

అలా అడిగినట్టయితే నే నే సత్యసంధుణ్ణయితే ఏమని జవాబు చెప్పేవాడిని? "ఆ అమ్మాయికి అసలు నా ముక్కూ మొగమూ తెలియదురా బాబూ, భూ భారంలో కొన్ని పౌనుల తూకానికి యీ వ్యక్తి బాధ్యుడని కూడా ఆ కుర్రది కల గని వుండదు: మీ లాగానే నేను ఎన్నడన్నా ఆ అమ్మాయిని పై అంతస్థులో నిలుచుని వుండగా చూడడమే: మీ అంత పరకాయించి కూడా చూసిన పాపాన పోలేదు:"

కాని, వాళ్ళు ఏమనుకున్నారు ? నా ప్రణయం భగ్నమై పోయిందనీ, అందువల్ల నా తల విషాదంలోకి రేగి పోతూన్నదనీ. ఏమన్నా అనుకోనీ, నా జుట్టు మళ్ళా హాయిగా దుబ్బేసుకు పోతూంది:

లాడ్జిలో తతిమ్మా గదుల్లో సుగంధద్రవ్యాలు చెలరేగుతూన్నవి: ఆ మేడ ముందర రోడ్డు మా వాళ్ళ కాళ్ళ క్రింద పడి గుంటలు పడిపోతూన్నది: యెవడికి వాడు ప్రస్తుతం ఖాళీగా, రికామీగా వున్న ఆ కటాక్షం తమమీద పడితే బాగుండు నని కాళ్ళు బలపాలు కట్టేట్టు తిరుగుతున్నారు: ఎవడికి వాడికే అద్దంలో నవమన్మ ధుడులా కనబడుతున్నాడు:

అలా తిరగనీయండి, తిరక్క మొగాడు చెడ్డాడని: కాళ్ళలో సత్తువ వున్న న్నాళ్ళూ తిరుగుతారు: తిరగనీయండి: ఎలాగూ వేసంగి రానే వస్తూంది.